క్లుప్తంగా

వేద పండితునికి సన్మానం



రవిప్రకాష్ శర్మను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆస్థాన వేద పండితుడు యనమండ్ర వెంకట రవిప్రకాష్ శర్మ అవధానిని శనివారం ఆలయంలో ఘనంగా సన్మానించారు. యజుర్వేదం పూర్తి చేసిన సందర్భంగా రవిప్రకాష్ శర్మకు గత నెలలో హైదరాబాద్‌కు చెందిన రుద్రాక్ష పీఠం సంస్థ సింహతలాటం (స్వర్ణ కంకణం)తో సన్మానించి యజుర్వేద విశారద బిరుదు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా దేవస్థానంలో ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు, అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యురాలు కూరాళ్ల రమాదేవి తదితరులు రవిప్రకాష్ శర్మను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఉపాధ్యాయుల ధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల, బదిలీ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని, జీఓ 117 నిలుపుదలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పీబీవీఎస్ఎల్ నారాయణ, సెక్రటరీ జనరల్ గుడిమెల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కోచైర్మన్ బి.మనోజ్ కుమార్, పీఎస్ ప్రకాశరావు, షేక్ రంగవలీ, బి.రెడ్డి దొర, బీఏ సాల్మన్‌రాజు, సాయిరాజు భల్లం, ఎస్‌కే ముస్తాఫాలీ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రకృతి సేద్యం సిబ్బందికి బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేస్తోన్న 450 మంది సిబ్బందికి ఆరు నెలల జీతాలు రూ.44 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు.

ఈ-పంట నమోదు

పెదవేగి : మండలంలో రైతులంతా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం ప్రియాంక కోరారు. శనివారం మండలంలోని పెదకడిమి, అమ్మపాలెం, కొప్పాక, గ్రామాలను ఆమె సందర్శించి ఈ-పంట నమోదును పరిశీలించారు. ఇప్పటికే 2536.25 ఎకరాల్లో పంట నమోదైందని ఆమె తెలిపారు. వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు త్వరితగతిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- 'అమృత్ భారత్ స్టేషన్'లో ఎంపిక
- రూ.21.10 కోట్లు కేటాయింపు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని ముఖ్యమైన పట్టణాల్లో ఏలూరు ఒకటి. ఇది కొత్తగా ఏర్పడిన జిల్లాకు కేంద్రంగా ఉంది. ఏలూరు పేరు చెబితే గుర్తుకొవచ్చేది తివాచీ పరిశ్రమ. ఇటు భౌగోళికంగా, అటు చారిత్రాత్మకంగా వివిధ రంగాల్లో గుర్తింపు తెచ్చుకున్న ఏలూరు నగరంలోని రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ప్రస్తుతం ఈ స్టేషన్ నుంచి నిత్యం 61 రైళ్లు వేలాది మంది ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు, వివిధ ప్రాంతాల నుంచి ఏలూరుకు చేరవేస్తున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఈ స్టేషన్ అభివృద్ధికి రూ.21.10 కోట్లు కేటాయించారు. వీటితో స్టేషన్ ప్రధానద్వారం, ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి చేయనున్నారు. దీంతో ఉత్తమ శ్రేణి రైల్వే స్టేషన్‌గా ఏలూరు స్టేషన్ రూపాంతరం చెందనుంది.

రైల్వే ప్రయాణికుల హర్షం

ఏలూరు స్టేషన్ భౌగోళికంగా ఇటు మెట్ట, అటు డెల్టా ప్రాంతాలకు కీలక కేంద్రంగా ఉంది. ఆక్వా, వరి, ఉద్యాన, వాణిజ్య పంటల ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇంతటి కీలకమైన స్టేషన్‌ను అభివృద్ధి చేయనుండటం పట్ల ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వందే భారత్ లాంటి రైళ్లకు కూడా ఏలూరులో హాల్ట్ ఇస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని వారు కోరుతున్నారు.



ఏలూరు రైల్వే స్టేషన్ ముఖ ద్వారం



ప్రపోజ్డ్ స్టేషన్ ముఖ ద్వారం

స్టేషన్ అభివృద్ధితో ప్రయోజనం



"ఏలూరు రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులు, వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఇటు ప్రయాణికులకు ప్రయోజనంతోపాటు అటు రైల్వే శాఖకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఏలూరుస్టేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు.

– నాగం శివ, మాజీ డీయూఆర్‌సీసీ సభ్యుడు, ఏలూరు

త్వరలో పనులు ప్రారంభం



అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఏలూరు స్టేషన్ అభివృద్ధికి రూ.21.10 కోట్లు కేటాయించారు. స్టేషన్ ముఖద్వారం, ఫ్లాట్ ఫారంలకు సంబంధించి సాంకేతిక సిబ్బంది, అధికారులు సర్వే చేశారు. ప్రయాణికులకు మరింత సౌకర్యాలు కల్పించేందకు రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. అభివృద్ధి జరిగితే స్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి.

– ఎస్‌వీ రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్, ఏలూరు

సంక్షేమ బోర్డును పరిరక్షించాలి

ఏలూరు (టూటౌన్): భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని ఏపీ ప్రగతి శీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఇఫ్టూ) ఏలూరు నగర అధ్యక్షుడు కాకర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి నవ్వుడు నెహ్రూబాబు కోరారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. కార్మిక శాఖలో పెట్టుకున్న క్లెయిమ్స్, కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న నిర్మాణ రంగకార్మికులకు కార్డు ఇచ్చేవిధంగా చేయాలన్నారు. నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి లేని సమయంలో ప్రభుత్వం ఆర్థికంగా సహకరించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, మూతపడిన సంక్షేమ బోర్డును తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో వర్మ, దుర్గారావు, భాస్కరరావు, ప్రసాద్, లక్ష్మణరావు, రామారావు, శారద, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ డే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 184వ ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని నగరంలో ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక ఓవర్ బ్రిడ్జి మెట్ల వద్ద ఉన్న కెమెరా సృష్టికర్త డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఏలూరు పరిసర ప్రాంతాల ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

గోవింద నామ సంకీర్తన ముగింపు ఉత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వశాంతి, లోకకళ్యానార్థం స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో గత 60 రోజులుగా పద్మావతి మహిళా మండలి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు కోటీ 18 లక్షల సార్లు గోవిందనామ సంకీర్తన చేశారు. ఈ అఖండ కోటి గోవిందనామ సంకీర్తన కార్యక్రమం ముగింపు ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గోవిందనామ సంపూర్ణ హోమం, లక్ష్మీనారాయణ, సుదర్శన, వేంకటేశ్వర, పద్మావతి మూల మంత్ర హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించి వేద ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో దేవస్థానంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్వామి వారికి విశేష పూజల కోసం 108 బంగారు పుష్పాలను తమ ట్రస్టుబోర్డు సభ్యుల సహకారంతో సమీకరించినట్టు చెప్పారు. ఇకపై ప్రతి గురువారమూ స్వామి వారికి బంగారు పుష్పాలతో పూజ చేయనున్నట్టు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు మాట్లాడుతూ స్వామి వారికి బంగారు నామాలు, శంఖచక్రాలు తయారు చేయించడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది భక్తులు స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. గోవిందనామ సంకీర్తనలో పాల్గొన్న పద్మావతి మహిళా మండలి సభ్యులను, ఈ కార్యక్రమానికి సహకరించిన భక్తులను దుశ్శాలువాలతో, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మహిళా మండలి సభ్యులను సన్మానిస్తున్న దేవస్థానం ప్రతినిధులు

పంట రుణాలు అందించాలి

ఏలూరు (టూటౌన్): బ్యాంకర్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సాగు భూమిలో 70 శాతంపైగా కౌలు రైతులే పంటలు వేస్తున్నారని, బ్యాంకుల నుంచి పంట రుణాలు కౌలు రైతులకు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. జిల్లాలో రెండు లక్షల మంది వరకు కౌలు రైతులు ఉన్నారని, వీరిలో 56 వేల మందికి పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేసినా భూ యజమాని పంట రుణం తీసుకున్నారనే పేరుతో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని వివరించారు. కౌలు రైతులందరికీ రూ.లక్ష వరకు వడ్డీలేని పంట రుణ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. జిల్లాలో ఉద్యాన పంటల రైతులకు 90 శాతం సబిసడీపై డ్రిప్ పరికరాలను అందించాలన్నారు. గతంలో అమలు చేసిన డ్రిప్ సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

శరవేగంగా మెడికల్ కాలేజీ హాస్టల్ నిర్మాణం

- విద్యార్థులకు డైనింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు
- యుద్ధప్రాతిపదికన శాశ్వత హాస్టల్ భవనాల నిర్మాణం
- విమర్శలకు తావిస్తోన్న అధికారుల తీరు

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల కల నెరవేరింది. 10 రోజుల్లో మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభంకానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని దశాబ్దాల కలను నిజం చేస్తూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు విశేష కృషి చేశారు. ఎమ్మెల్యే నాని 2019లో సీఎం జగన్‌తో మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హాస్టల్, డైనింగ్ నిర్మాణ పనులు

ఏలూరు జీజీహెచ్‌లో ఎంసీహెచ్ బ్లాక్‌పై తాత్కాలిక ప్రాతిపదికన మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్, డైనింగ్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంసీహెచ్ భవనం రెండో అంతస్తులో బాలురు, బాలికలకు వేర్వేరుగా, ప్రత్యేక వసతులతో హాస్టల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇద్దరు విద్యార్థులకు ఒక గది చొప్పున 150 మందికి హాస్టల్ వసతి కల్పించనున్నారు. హాస్టల్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. విద్యార్థులకు ప్రత్యేకంగా టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. బాలురు, బాలికలకు హాస్టల్‌కు వెళ్లేందుకు ప్రత్యేకంగా మెట్ల దారి ఏర్పాటు చేశారు. ఎంసీహెచ్ బ్లాక్‌తో సంబంధం లేకుండా బయట వైపు నుంచీ హాస్టల్‌లోకి వెళ్లేలా ఐరన్ మెట్లు అమర్చారు.



ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో వేగంగా మెడికల్ కాలేజీ హాస్టల్ శాశ్వత భవనాలు నిర్మాణం



హాస్టల్‌లో ప్రత్యేకంగా మెట్లదారి ఏర్పాటు

శాశ్వత హాస్టల్ భవనాలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ వసతికి ఎంసీహెచ్ బ్లాక్‌కు కుడివైపున జీ ప్లస్ ఫోర్ హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా శాశ్వత పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. ఈ భవనాలను 2024 కొత్త సంవత్సరం నాటికి పూర్తి చేయనున్నారు. సుమారుగా రూ.40 కోట్ల వ్యయంతో భవనాలను ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నారు.

అధికారుల తీరుపై సందేహాలు?:

ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు ఎమ్మెల్యే నాని ప్రతిష్టాత్మకంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారు. కానీ అధికారుల తీరుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కళాశాల భవనాలు, హాస్టల్ వసతి, డైనింగ్ వంటివి తాత్కాలికంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా జాప్యంతో నెలకొంది. పనులను పర్యవేక్షించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాలేజీ భవనాలు, హాస్టల్, సౌకర్యాలు చూసుకునేందుకు వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు చెబుతున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	50-84
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	56-60	బీట్‌రూట్	32
కాకర కాయలు	50-60	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	30 - 46	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	09
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	11
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	02
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	18
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	27

రోడ్ల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో మంగళవారం రహదారులు నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హామీ ఇచ్చారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట ఉప ఎన్నిక విజయోత్సవ ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వీర్మకుంట ఉప ఎన్నికలో 286ఓట్ల మెజార్టీతో వైఎస్సార్ సీపీ మద్దతుదారులను గెలిపించి నాయకుల్లో మరింత బాధ్యత పెంచిందన్నారు. గ్రామంలో మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్టీలకు కుల ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందిస్తామని చెప్పారు. స్థానిక నాయకుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వీరమ్మకుంట నుంచి పెదపాడు వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, సంబంగి శ్రావణ్‌కుమార్, పామర్తి అచ్యుత్‌గౌడ్, స్థానిక నాయకులు పూడి రంగప్పారావు, మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు, రెడ్డి జగన్, గుణుపూరు మహేష్, రెడ్డి రంగారావు పాల్గొన్నారు.



వీరమ్మకుంటలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పంటలకు జీవం పోసిన వర్షం

- అన్నదాత హర్షం
- నియోజకవర్గంలో 21,105 హెక్టార్లలో పంటల సాగు

పెదవేగి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఇది పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలున్నాయి. వీటిలో ప్రస్తుతం 21,105 హెక్టార్లలో ఖరీఫ్‌లో వరి, మొక్క జొన్న, చెరకు, వంగ, తదితర పంటలు ఉన్నాయి. విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాధార మెట్ట పంటలు కావడంతో గతంలో రైతులు ఇదే సమయంలో సరైన వర్షాలు లేక పంటలకు జీవం లేకుండా ఉండేవి. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా రైతులు ట్యాంకర్లు, ఇంజిన్ల ద్వారా నీరు పెట్టుకుంటూ అష్టకష్టాలు పడేవారు. అలాంటి పరిస్థితులకు అవకాశం లేకుండా ఖరీఫ్ ప్రారంభం నుంచి విస్తారంగా కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. మరింత వర్షం కురిస్తే పంటలకు మేలు కలుగుతుందని రైతులు అంటున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలకు ఉపశమనం కలిగించాయి. శనివారం రోజంతా జల్లులు పడుతూనే ఉండటంతో రైతులతో పాటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారి ఎం ప్రియాంక మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిశాయని, దీంతో పంటలకు మేలు చేకూరుతుందన్నారు.



పెదవేగిలో వరి పొలం

శ్రీవారి సేవలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి



హర్షవర్ధన్‌కు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి కె.హర్షవర్ధన్, పద్మావతి(ఐఏఎస్) దంపతులు శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు వారికి శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి స్వామివారి మొమెంటో, ప్రసాదాలను అందజేశారు.

నేర ప్రవృత్తిని విడనాడాలని హితవు

చింతలపూడి : నేర ప్రవృత్తిని విడనాడాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు ఖైదీలకు హితవు పలికారు. చింతలపూడి సబ్‌జైల్‌ను శనివారం ఆయన సందర్శించారు. సబ్‌జైల్‌లో ఉన్న ముద్దాయిలను ఆహారం, వసతి, వైద్య సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేని నిందితులు, శిక్షలు పడి అప్పీలు చేసుకునే అవకాశం ఉన్న ముద్దాయిలకు ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందచేస్తామని తెలిపారు. అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించాలనుకుంటే జైల్లో గడపాల్సి వస్తుందన్నారు. నేర ప్రవత్తికి దూరంగా ఉండి కష్టపడి పని చేసుకుని సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. సెప్టెంబర్ 9వ తేదీన కోర్టులో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ జి వెంకటేశ్వరరావు, జైల్ విజిట్ ప్యానెల్ న్యాయవాదులు బుల్లా ఏసుపాదం, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి ,హెడ్ వార్డర్ సాంబశివరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ

జంగారెడ్డిగూడెం : వసతిగృహంలో మెరుగైన వసతులు కల్పించి, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని బీసీ కళాశాల బాలికల వసతిగృహం వార్డెన్, సిబ్బందికి జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి సూచించారు. శనివారం జంగారెడ్డిగూడెం బీసీ కళాశాల బాలికల వసతిగృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం పట్టెన్నపాలానికి చెందిన పి.రాంబాబు కుమార్తె ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో యువతి తండ్రి రాంబాబు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె అదృశ్యం విషయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బండారు వీరాంజనేయులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

శ్రీవారి పథకాలకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి పథకాలకు హైదరాబాద్‌కు చెందిన వెంపడ సురేష్, శ్రీలత దంపతులు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.